క్లుప్తంగా

లింగాల ఎస్‌ఐగా అనిల్‌కుమార్



లింగాల : మండల ఎస్‌ఐగా అనిల్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆరు నెలలుగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ మధుసూదనరావు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. పులివెందులలో శిక్షణ పొందిన ఎస్‌ఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై సిబ్బందితో కలిసి తగిన చర్యలు చేపడతామన్నారు.

పంట నమోదు త్వరగా పూర్తి చేయాలి



పాతసంగటిపల్లెల్లో పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

పెండ్లిమర్రి : సాగు చేసిన ప్రతి పంటకు ఇ–పంట నమోదు త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాతసంగటిపల్లె, వెల్లటూరు గ్రామ పొలాల్లో పంట నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట నమోదుకు సిబ్బంది తక్కువగా ఉంటే మిగతా సచివాలయ సిబ్బందిని కేటాయించి యుద్ధ ప్రాతిపదకన చేయాలని అధికారులకు సూచించారు. త్వరలో రబీ సీజన్‌కు సబంధించి బుడ్డ శనగ విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన రైతులు దగ్గరలోని రైతుసేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పత్తి పంటను పరిశీలించి రైతులకు పంట సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎన్‌టీఆర్ వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు బోర్డులను ఏర్పాటు చేశారు. స్థానికంగా రెండు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎన్‌టీఆర్ వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 2700 కోట్ల రూపాయలు బకాయిలు ఉండటంతో వాటిని చెల్లించేవరకు ఆరోగ్యశ్రీ వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. స్థానికంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు తాము ఎన్‌టీఆర్ వైద్య సేవలను అందించలేమని వైద్యం చేయించుకుంటే సొంత డబ్బులు పెట్టి వైద్యం చేయించుకోవాలని సూచించారు.

సంస్కృతిని కాపాడటంలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర



మాట్లాడుతున్న రిటైర్డు ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి

సింహాద్రిపురం : హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని రిటైర్డ్ ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం నంద్యాలంపల్లెలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం, ప్రతి కుటుంబంలో ఐక్యతా భావం పెరగడంవల్లే దేశం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సంఘ ప్రతినిధులు బద్రినాథశర్మ, మండల ప్రముఖ్ రాధాకృష్ణారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు శశిభూషణ్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మోహనకృష్ణారెడ్డి, అమరనాథరెడ్డి, భానుకోట శివయ్యస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడిగా రామచంద్ర



వేంపల్లె : ఉమ్మడి కడప జిల్లా బీసీ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన గూడూరు రామచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల పీలేరులో బీసీ ఫ్రంట్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి రమణమూర్తి పాల్గొని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రను నియమించి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ లందరూ జాగృతం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 79 ఏళ్ల భారత్‌లో ఐదు శాతం ఉన్న వర్గాలు అధికారంలో ఉంటే 60 శాతం ఉన్న బీసీలు బానిసలుగా బతుకుతున్నారన్నారు. నిరంతరం బీసీల అభివృద్ధికి, సంక్షేమానికి రాజీలేని పోరాటం చేస్తానన్నారు.

జిల్లా జట్లకు విద్యార్థులు ఎంపిక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీసాయిచైతన్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎస్.మహమ్మద్ అజాద్ అండర్–19 జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు, వి.బద్రినాథ్ జిల్లా బేస్ బాల్ జట్లకు ఎంపికయ్యారని ఆ కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. ఎంపికపట్ల కరస్పాండెంట్ హర్షం వ్యక్తం చేశారు.

పశు బీమా లేక నష్టాల ఊబిలో పాడిరైతు



పశువుల షెడ్‌లో పాడిగేదేలు



కొట్టాలపల్లెలో మృతిచెందిన గేదె

కొండాపురం : గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పాడి పశువులకు ప్రభుత్వమే బీమా చెల్లించి చనిపోయిన పశువులకు బీమా డబ్బులు పాడి రైతులకు చెల్లించి అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాడి పరిశ్రమను గాలికి వదిలేసింది. మండలంలో బి.కొట్టాలపల్లె, బెడుదూరు, యనమలచింతల, లావనూరు, తిమ్మాపురం, పెంజిఅనంతపురం, వెంకయ్యకాలువ, టి.కోడూరు, కె.సుగుమంచిపల్లె, దత్తాపురం పునరావాసకేంద్రం, పలు గ్రామాల్లో అధికంగా పాడి పరిశ్రమపై రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. మండలంలో పశువులు 2852, ఆవులు 271 ఉన్నాయి. పాడి పశువులు ఏదైనా ప్రమాదం సభవించి మృత్యువాత పడితే రైతులకు నష్టం వాటిల్లకుండా పశు బీమా ఉండేది. ప్రస్తుతం పశుబీమా నిలిచిపోవడంతో పాడిరైతులు ఇబ్బందిపడుతున్నారు. పశుపెంపకంపై ఆధారపడిన వారు పశువులు విద్యుదాఘాతంతోనో, ఇతర అనారోగ్య సమస్యలతోనే చనిపోతే ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం మేలు రకం జాతి ఆ పశువులు కొనుగోలుకు రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. మండలంలోని బి.కొట్టాలపల్లెలో ముగ్గరి రైతులకు చెందిన పశువులు 5 అనారోగ్యంతో చనిపోయాయి. ఒక్కొక్క గేదెకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు నష్టం జరిగింది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పశువులు చనిపోతున్నాయి. చనిపోయిన పశువులకు నష్టపరిహారం అందేలా చూడాలని ప్రభుత్వంను పాడిరైతులు కోరుతున్నారు.

ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాం



పశువులు మృత్యువాత పడితే తీవ్రంగా నష్టపోతున్నాం. గతంలో బీమా సౌకర్యం ఉండటంతో పశువులు చనిపోయినా కొంత డబ్బు అందేది. ఆపథకం నిలిచిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నాం. పాడి రైతులను పోత్రత్సహించేందుకు ప్రభుత్వం పశువులకు బీమా సౌకర్యం కల్పించాలి.

– కె.అరుణ్‌కుమార్‌రెడ్డి, బి. కొట్టాలపల్లె

పశువైద్యుడు ఎమన్నారంటే



కూటమి ప్రభుత్వం వచ్చిన ప్రారంభంలో కొంత బడ్జెట్ విడుదల చేయడంతో కొన్ని పశువులకు బీమా చెయించాం. ప్రస్తుతం పశువుల బీమా నిలిచిపోయింది. పశువులు, ఆవులకు బీమా చేయించడానికి బీమా పథకం లేదు. ప్రస్తుతం పాడిపశువులు చనిపోతే నష్ట పరిహారం రాదు.

– పశువైద్యుడు రాజశేఖర్‌రాజు, కొండాపురం

ఆగిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పులివెందుల టౌన్ : పులివెందుల నియోజకవర్గంలో గతంలో ఆగిపోయిన అభివృద్ధి పనులకు వెంటనే నిధులను విడుదల చేసి వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, సీఐటీయూ నాయకులు గఫూర్‌లు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక గఫూర్ డ్రైవింగ్ స్కూలులో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో పాడా పేరుతో అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలతో పనులు ప్రారంభించారని, ప్రస్తుతం కొన్ని అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయే పరిస్థితి ఉందన్నారు. గతంలో టెండర్ పిలిచిన వర్క్స్ అన్ని పూర్తి చేసి నిధులు కొరత లేకుండా చూడాలన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలలో ఎమ్మార్ఐ, సిటీ స్కానింగ్‌లకు సంబంధించి యంత్రాలను తరలించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు చేసుకోవడానికి, ఎంఆర్‌ఐ, ప్రజలకు అవసరమైన మందులను సరఫరా చేయాలన్నారు. ప్రస్తుత పాలకులు ప్రజల మీద కోపం చూపడం, నిధులు ఆపడం అభివృద్ధిని నిలిపివేయడం సరైంది కాదన్నారు. అధికారంలోకి వచ్చిన ఎవరైనా అభివృద్ధి పనులను పూర్తి చేయాల్సిన అవసరం, బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందన్నారు.

బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ



ఎంఈవోకు వినతిపత్రాన్ని అందచేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

వల్లూరు : పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రతినిధులు తెలిపారు. బోధనేతర పనుల వలన బోధనా సమయం హరించుకుపోతోందని, పలుదఫాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలువు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర పనులను బహిష్కస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు వారు వల్లూరులోని ఎమ్ఆర్‌సీ వద్ద మండల విద్యా శాఖాధికారి కరీముల్లాను శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి (హెచ్‌ఎమ్ అసోసియేషన్), ఎజాస్ అహమ్మద్, శివ కుమార్ రాజు, భాస్కరయ్య (యూటీఎఫ్), సురేష్ బాబు (ఎస్‌టీయూ), పోతులూరయ్య (ఏపీటీఎఫ్). నాగరాజు, శేఖర్ బాబు (ఏపీయూఎస్), కరీముల్లా (హిందీ పరిషత్) తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వం చేపట్టె బోధనేతర పనులను ఇక నుంచి బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. శుక్రవారం ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలువు మేరకు ×పోరుబాట¥ కార్యక్రమంలో బోధనేతర పనులను, విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కుండా భాస్కర్ తెలిపారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందించారు.

జీఎస్టీ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీ ఫలాలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి చౌక్ సెంటర్ వరకు సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ ప్రహ్లాద్, నాయకులు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

కమలాపురం : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటలకు కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

13న చలో విజయవాడను జయప్రదం చేయండి

ఎర్రగుంట్ల : రాష్ట్ర పవర్ జేఏసీ పిలువు మేరకు ఈనెల 13వ తేదీన విజయవాడలో మహాధర్నా జరుగుతుందని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం ఆర్టీపీపీలోని డిప్లొమో అసోసియేషన్ భవనంలో ఆర్టీపీపీ ప్రాంతీయ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మహాధర్నాకు 12వ తేదీ సాయంత్రం బయలుదేరి రావాలన్నారు.

ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో శ్రీ చైతన్య ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్, తదితరులు

వేంపల్లె : స్కూల్ గేమ్ ఫెడరేషన్ గేమ్స్‌లో వేంపల్లి శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. మండలస్థాయి అండర్–14, అండర్–17 వాలీబాల్, ఖో–ఖో చెస్, బ్యాట్మింటన్, యోగ, షాట్ పుట్, జావిలిన్, డిస్కస్, హై జంప్ వంటి అథ్లెటిక్స్ ఈవెంట్లలో తమ పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులు ప్రతిభను కనబరిచి డివిజనల్ స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ విజయానికి పీఈటీలు కృష్ణ ప్రసాద్, జ్యోతి ప్రకాష్, షేక్ నియాజ్, నాగరాజులు కృషిచేశారన్నారు.

సేవలకు అంతరాయం

సింహాద్రిపురం : స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో నాలుగు రోజులపాటు బ్యాంకు సేవలకు అంతరాయం ఉంటుందని ఆ బ్యాంకు మేనేజర్ కృష్ణకిశోర్ తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ సోమవారం వరకు అన్ని రకాల లావాదేవీలు పనిచేయవన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులోకి విలీనం చేయడంతో పేర్లు మార్పు జరుగుతుండటంవల్ల సాంకేతిక కారణాల దృష్ట్యా సేవలు నిలిచిపోనున్నాయన్నారు. బ్యాంకు ఖాతాదారులు ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. శుక్రవారం కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర మాట్లాడుతూ శుక్రవారం కడపలోని శ్రీచైతన్య హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్ –19 గోల్ షూట్‌బాల్ సంబంధించి రాష్ట్రస్థాయి ఎంపికలు జరిగాయి. ఈనెల 11, 12వ తేదీలలో చిత్తూరు జిల్లాలోని నెరబైలు జెడ్పీ హైస్కూలులో నిర్వహించే అండర్–19 రాష్ట్రస్థాయి గోల్ షూట్‌బాల్ పోటీలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్న గురువంశీ, ఆరిఫ్, హరి ప్రసాద్, నరసింహ, కాత్యాయనిలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ బాలకొండ గంగాధర్, లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి మాధవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీటెక్ రవికి బహిరంగ లేఖ

పులివెందుల : మాజీ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి ప్రజల అవసరాల కోసం ఉంచిన స్థలాని కబ్జా చేశారని ప్రజా ఐక్య వేదిక నాయకులు సీఆర్వీ ప్రసాదరావు, ఆంజనేయులు, వెంకటేశులు, వెనుతుర్ల రవిశంకర్‌రెడ్డి తదితరులు టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి బహిరంగ లేఖ ద్వారా తెలిపారు. శుక్రవారం వారు ఒక ప్రకటన ద్వారా తెలుపుతూ వేంపల్లె మండలం పాములురు గ్రామ రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 513లో ప్రజల అవసరం కోసం ఉంచిన స్థలాన్ని మాజీ టీడీపీ జిల్లా కార్యదర్శి ఎద్దుల శేషా రెడ్డి కబ్జా చేసి పత్తి పంటను సాగు చేశారు. దీనిపై ప్రశ్నిస్తే నా వెనుక టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సహకారం ఉందని నేరుగా మండల రెవెన్యూ అధికారి చెప్పినట్లుగా మా దృష్టికి వచ్చిందన్నారు. ఆ గ్రామ రెవెన్యూ అధికారి (దళితుడు) సహకరించలేదని రాయలేని భాషలో బెదిరించి తిట్టడాన్ని మేమందరం ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి విషయాలను మంత్రి నారా లోకేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి అయిన మీరు కానీ ఇటువంటి వాటిని అంగీకరించరని, జరిగిన విషయం వాస్తవమన్నారు. ఎద్దుల శేషారెడ్డి ప్రభుత్వ భూములనే కాకుండా పేదరికంలో ఉన్న యువతకు ఆశ కల్పించి ఉద్యోగాలు ఇప్పిస్తానని వాళ్ల దగ్గర నుండి డబ్బులు తీసుకుంటున్నట్లు బయట చర్చ జరుగుతోందన్నారు. ప్రజా సంఘాల నాయకులమైన మేము ఆ భూమిని కాపాడటం కోసం ఈ లేఖను మీకు రాస్తున్నామన్నారు. వీటన్నింటిపైన మీరు విచారించుకు ని ఆ భూమిలో తక్షణమే ప్రభుత్వ భూమి అని బో ర్డు నాటించి, ఆ పంటను లేకుండా చేయాలన్నారు. మేము చెప్పిన విషయాలన్ని వాస్తవాలు అని నిర్ధారణ అయిన వెంటనే ఎద్దుల శేషారెడ్డిని పార్టీ నుండి బహిష్కరించాలన్నారు.

ఈ విషయాలన్ని జిల్లా అధ్యక్షుడు దృష్టికి, మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. విజ్ఞతతో ఆలోచించి మీరు సరైన నిర్ణయం తీసుకోవాలని మేం విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

పన్ను వ్యవస్థను సులభతరం చేయడమే లక్ష్యం



ఎగ్జిబిషన్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి

పులివెందుల : టెక్నాలజీ ఆధారిత పన్ను వ్యవస్థను సులభతరం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ కాంప్లెక్స్‌లో నూతన జీఎస్టీ 2.0 సిస్టమ్ అమలులో భాగంగా ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ కమ్ సేల్స్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ప్రదర్శనను వాణిజ్య శాఖ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాముడులు ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో పులివెందుల పరిధిలోని అన్ని ఎలక్ట్రానిక్స్ వ్యాపారులు పాల్గొని తమ ఉత్పత్తులను (టీవీ, ఏసీ, ఎల్‌ఈడీ, మానిటర్లు) తదితర వాటిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 అమలుపట్ల వ్యాపారులకు అవగాహన కల్పించడం, టెక్నాలజీ ఆధారిత పన్ను వ్యవస్థను సులభతరం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అన్ని రకాల వ్యాపారవేత్తలు, పౌరులు ఈ కార్యక్రమానికి హాజరై లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు రాజశేఖర్ రెడ్డి, పుష్పలీల, స్వరాజ్యలక్ష్మి, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాతో నిరుద్యోగ నిర్మూలన



నియామక పత్రాలు అందుకున్న నిరుద్యోగులతో పరిశ్రమల ప్రతినిధులు

కమలాపురం : ప్రభుత్వం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలు నిరుద్యోగతను నిర్మూలించడానికి దోహదపడతాయని కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా–2025కు విశేష స్పందన లభించింది. 10 ప్రముఖ సంస్థలు ఈ జాబ్ మేళాకు ప్రాతినిధ్యం వహించగా వివిధ ప్రాంతాల నుంచి 448 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో 251 మందిని ఇంటర్వ్యూలు నిర్వహించిన సంస్థలు ఎన్నిక చేసి నియామక పత్రాలు అందజేశారు. ప్రతి 3 మాసాల కొక సారి పరిశ్రమలు, సంస్థలు ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహిస్తే నిరోద్యోగతను నిర్మూలించవచ్చన్నారు. నియామక పత్రాలు అందుకున్న యువతీ యువకులు మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు, ఏపీఎస్ఎస్‌డీసీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ రద్దుకు మద్దతు ఇవ్వాలి



సంతకాల సేకరణ పోస్టర్‌లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, మైలవరం : ప్రస్తుత కూటమి ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం దుగ్గనపల్లెలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెడికల్ కాలేజిలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసి ప్రజలకు వైద్యం భారంగా మార్చేబోతుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి నిరుపేదకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజిలను మంజూరు చేయించారు. అందులో భాగంగా ఐదు కాలేజిలు ప్రారంభించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మొత్తం 17 కాలేజిలను ప్రైవేటీకరణ చేసి పేద విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశాన్ని కొల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రతి గ్రామం నుంచి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గవర్నర్‌కు సంతకాలు చేసి పంపాలని ఆవిధంగా తమ నిరసన వ్యక్తం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు ఈ రోజు ఈ కార్యక్రమాన్ని దుగ్గనపల్లిలో ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఎలాంటి పనులు పూర్తి స్థాయిలో చేయడంలేదని దుగ్గనపల్లి గ్రామంలో ఉన్న సిమెంట్ పరిశ్రమ కూడా పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, అధికారప్రతినిధి కొమెర్ల మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, చిన్న కొమెర్ల సర్పంచ్ జగదీశ్వరరెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, ఆవుల గుర్విరెడ్డి, దుగ్గనపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వరుడు శంకర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లె గ్రామానికి చెందిన ఎంపీటీసీ నాగ మల్లారెడ్డి కుమారుడు, నూతన వధూవరులైన శంకర్‌రెడ్డి, భారతిల వివాహం శనివారం పాతసంగటిపల్లెలో జరగనుంది. ముహుర్తానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అందుబాటులో ఉండని కారణంగా ముందస్తుగా శుక్రవారం నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ రమణారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, మండల యూత్ అధ్యక్షుడు శివపురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జమ్మలమడుగు రూరల్ : నియోజకవర్గంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ రాజగోపాల్ శుక్రవారం ఒక ప్రకసటలో తెలిపారు. జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని విద్యుత్ లైన్ల మెయింటైన్స్ నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ ప్రియదర్శన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముద్దనూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లి రోడ్డు, వినాయకనగర్, సుందరయ్యనగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఏస్టేట్ ప్రాంతాలలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ మెయింటైన్స్ పనులు జరుగుతాయన్నారు. వినియోగదారులు సహకరించగలరని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కొండాపురం : మండలంలోని టి.కోడూరు గ్రామంలో శుక్రవారం పేకాట అడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 3650 నగదు స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ ఆర్.శివనాగిరెడ్డి తెలిపారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ మధుసూదన్‌రావు



వల్లూరులో నాటకం ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కమలాపురం : సమాజంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం అని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించు కోవడం అత్యంత అవసరం అని ఆయన తెలిపారు. అలాగే ఉద్యోగ సంబంధిత ఒత్తిడిని ఆఫీసు వరకు మాత్రమే పరిమితం చేసి ఇంటికి చేరుకున్న తర్వాత కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపడం ద్వారా మనసుకు విశ్రాంతి లభిస్తుందని, ఇది కుటుంబ బంధాలను మరింత బల పరుస్తుందన్నారు. మానసిక రుగ్మతతో బాధ పడుతున్న వ్యక్తుల విషయంలో ప్రతి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి రక్షణలోకి తీసుకుని వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. మానసిక రుగ్మత గల వ్యక్తులకు చట్ట ప్రకారం వారికి లభించే హక్కులను వినియోగించు కునేందుకు ఉచిత న్యాయ సేవలు పొందే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి ఉయద్ కిరణ్, న్యాయవాది మహేష్ బాబు, కోర్టు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం వుందని మెడికల్ కౌన్సిలర్ డాక్టర్ శిల్ప అన్నారు. వరల్డ్ మెంటల్ హెల్త్ వారోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం వల్లూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రిన్సిపాల్ నజీమున్నీసా అధ్యక్షతన విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మెడికల్ కౌన్సిలర్‌లు డాక్టర్ శిల్ప, డాక్టర్ నాగభూషణం, గౌతమీ, ప్రవల్లికలు పిల్లల భవిష్యత్‌కి శానిటేషన్, గుడ్ హెల్త్, మెడిటేషన్, యోగ ఎలా ఉపయోగపడతాయో వివరించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య రక్షణకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తోడ్పాటు నందించాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం నాటకం ద్వారా మానసిక ఆరోగ్యం వలన కలిగే మంచి ఫలితాలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.